క్లుప్తంగా

గొచక్కలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

పార్వతీపురంటౌన్: గొచక్క గిరిజన గ్రామంలో ఫ్యామిలి ఫిజిషియన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 79 మందికి వైద్యాధికారి కౌషిక్ వైద్య సేవలందించారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గర్భిణుల, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి వైద్య సేవలందించారు. 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సహకారం అందించారు.

మోసురులో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

పాచిపెంట: మండలంలోని మోసూరు గ్రామంలో సీఐ బాలకృష్ణ, ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రత్యేక బలగాలతో కలిసి సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఓటు హక్కు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. గొడవలకు పాల్పడేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వాహన తనిఖీలు ముమ్మరం చేశాయి. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. నగదు, మద్యం, ఇతర సామగ్రి తరలింపుపై నిఘా పెట్టినట్లు చెప్పారు. రూ.50 వేలకు మించి నగదు, పెద్ద ఎత్తున ఇతర సామగ్రి తరలించేవారు అందుకు సంబంధించిన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

రోగ నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేయాలి: డీఎంఓ

సీతానగరం: పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని, రోగనిర్ధరణ పరీక్షలతో పాటు రోగులకు అవసరమైన మందులను ఇవ్వాలని జిల్లా మలేరియా నివారణ అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు ఆదేశించారు. సీతానగరం పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ల్యాబ్ రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించాలన్నారు. ఆస్పత్రుల్లో అత్యవసర మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.పావనీ, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ ఉన్నారు.

వలంటీర్ల రాజీనామా

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి గ్రామంలో సేవలందించిన ఏడుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావుకు రాజీనామా పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికలపై వలంటీర్ల ప్రభావం ఉంటుందని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దురదృష్టకరమన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించామని, నిస్వార్థ సేవలందించిన తమపై నిందలు వేయడం తగదన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తెచ్చుకుంటాం

పార్వతీపురంటౌన్: సీతానగరం మండలం గెడ్డలుప్పి గ్రామ వలంటీర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే జోగారావును కలిసి మద్దతు తెలిపారు. వలంటీర్ పోస్టుకు రాజీనామాలు చేసినట్లు చెప్పారు. ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. ఇన్నాళ్లూ ప్రజలకు ప్రభుత్వ సేవలందించేందుకు పనిచేశామని, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు పనిచేస్తామని అన్నారు. కష్టపడి పనిచేయాలని వారికి ఎమ్మెల్యే జోగారావు సూచించారు.

జోరందుకున్న ప్రచారం

పార్వతీపురంటౌన్/సాలూరు రూరల్/సీతానగరం: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో పాటు పార్టీ నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను వివరిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని, ఇప్పుడు ఎన్నికలు రావడంతో మరోసారి మోసం చేసేందుకు 'సూపర్ సిక్స్' అంటూ బూటకపు హామీలతో ప్రజల ముందుకొస్తున్నారని, ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మీకు మంచి జరిగిందని అనిపిస్తే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

● సాలూరు మండలం అన్నంరాజువలస పంచాయతీ పరిధిలో డిప్యూటీ సీఎం రాజన్నదొర సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. పంచాయతీ పరిధిలోని రెయ్యివానివలస, గాదిలవలస, అంటివలస, పసువానివలస, పందిరి మామిడివలస గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ దండి శ్రీను, సర్పంచ్ చీమల రాములమ్మ, ఎంపీటీసీ సీదరపు అనూష, పార్టీ యువ నాయకుడు ఆర్నిపల్లి మురళి, తదితరులు పాల్గొన్నారు.

● సాలూరు పట్టణంలోని పెదబజారు గాంధీ పార్క్ వద్ద ఉన్న హనుమాన్ వ్యాయామశాఖను డిప్యూటీ సీఎం రాజన్నదొర సోమవారం సందర్శించారు. జిమ్‌కు వచ్చిన యువకులతో మాట్లాడారు. అక్కడ ఉన్న పరికరాలను పరిశీలించారు. మీ ప్రోత్సాహంతోనే ఈ జిమ్‌ను అభివృద్ధి చేసినట్లు జిమ్ నిర్వాహకులు ఆయనతో అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి రోజు కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. అనంతరం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ తనూజారాణిని గెలిపించాలని కోరారు.

● పార్వతీపురం పట్టణంలోని 13, 15 వార్డుల్లో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణితో కలిసి ఎమ్మెల్యే జోగారావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతీ గడప వద్ద వారికి ప్రజలు హారతులు ఇచ్చి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వార్డు కౌన్సిలర్లు చీకటి అనురాధ, ఎగిరెడ్డి భాస్కరరావు, వండాన కృపాభాయి, నేతాజీలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

● సీతానగరం మండలంలోని పణుకుపేట, కాశీపేట, ఆర్.వెంకంపేట గ్రామాల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్థానిక సర్పంచ్‌లు బి.పద్మావతి, టి.ధనుంజయమ్మ, పెంటలక్ష్మి, ఎంపీటీసీ ఎస్.నిర్మల, తదితరులతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే.. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, అందుకోసం రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణి, స్థానిక నాయకులు బి.శ్రీహరినాయుడు, బి.శ్రీనివాసరావు, జె.శ్రీకాంత్, జె.రాజమణి, ప్రభాకరనాయుడు, టి.శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● సాలూరు రూరల్: మండలంలోని జీగిరాం గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ సోమవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాజన్నదొరను ఎమ్మెల్యేగా, తనూజారాణిని ఎంపీగా గెలిపించాలని కోరారు.

● సాలూరు: పట్టణంలోని 23వ వార్డులో జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, 8వ వార్డులో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాజన్నదొరను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

● బలిజిపేట: మండలంలోని అజ్జాడలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే జోగారావు ఎమ్మెల్యేగా, తనూజారాణిని ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు దుర్గేశ్వరి, అక్కేన రామ్మూర్తినాయుడు, జగన్నాథంనాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


పార్వతీపురం టౌన్: పట్టణంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు


సాలూరు: 8వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, నాయకులు


సాలూరు రూరల్: రెయ్యివానివలసలో రాజన్నదొరకు మేళతాళాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు


సాలూరు: 23వ వార్డులో ప్రచారం చేస్తున్న జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, నాయకులు


సాలూరు: ప్రచారంలో భాగంగా జిమ్‌లో వ్యాయామం చేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


సాలూరు రూరల్: జీగిరాంలో ప్రచారం చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లరెడ్డి పద్మజ


సీతానగరం: పణుకుపేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావుకు హారతిస్తున్న మహిళ


పార్వతీపురం టౌన్: ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని అవ్వను కోరుతున్న ఎమ్మెల్యే జోగారావు


సాలూరు రూరల్: రాజన్నదొరకు పూలమాలతో సత్కరించిన గ్రామస్తులు


బలిజిపేట: అజ్జాడలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్, శ్రీకాంత్, తదితరులు

మేనిఫెస్టో పవిత్ర గ్రంథం


అలజంగి జోగారావు, ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్: రాజకీయ పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోలను బైబిల్, ఖురాన్, భగవద్గీత వంటి పవిత్ర గ్రంథాలుగా భావించాలని సూచించిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం అమలు చేశారని గుర్తుచేశారు. గతంలో కంటే మరింత మెరుగ్గా 'నవరత్నాలు ప్లస్' పేరుతో మేనిఫెస్టోను విడుదల చేయడం జరిగిందన్నారు. వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని పెంచడంతో పేదలకు మరింత మేలు చేకూరుతుందన్నారు. దశల వారీగా పింఛన్‌ను రూ.3,500లకు, అమ్మ ఒడి మొత్తాన్ని రూ.15వేల నుంచి రూ.17 వేలకు పెంచడం, విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలను కొనసాగించడం ద్వారా పేద పిల్లల ఉన్నత చదువులకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. పేదలందరికీ ఇళ్లు, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు ఉచిత కరెంట్, వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా వంటి పథకాల కొనసాగింపు సంతోషదాయకమన్నారు. చేనేతలకు ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షల సాయం అందిస్తారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్ ఏర్పాటుతో వైద్య సేవలు గ్రామీణులకు చేరువ అయ్యాయన్నారు. కాపు, ఈబీసీ నేస్తాల కొనసాగింపు, ఆర్థికం సాయం పెంపు సంతోషదాయకమని అన్నారు.

అభివృద్ధికి చిరునామా పెదబోరబంద

- పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన
- ప్రభుత్వ భవనాలు, సీసీరోడ్లతో కళకళలాడుతున్న గ్రామాలు
- ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు


గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు


పెదబోరబంద రైతుభరోసా కేంద్రం


గ్రామ సచివాలయం

సాలూరు రూరల్: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో కనీస సౌకర్యాలకు నోచుకోని పెదబోరబంద పంచాయతీ నేడు ప్రగతి పథంలో పయనిస్తోంది. పంచాయతీ పరిధిలోని పురోహితునివలస, సన్యాసిరాజుపేట, వల్లపురం, తెంటుబొడ్డవలస, చినబోరబంద, పెదబోరబంద గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామస్తుల అవసరం మేరకు సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి ట్యాంకులు, తదితర మౌలిక వసతులు కల్పించారు. గ్రామ సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం నిర్మాణంతో ప్రజలకు ఇంటి ముంగిటే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. పంచాయతీ పరిధిలో అర్హులైన 19,613 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.31,96,23,341లు నిధులు అందజేయడం జరిగింది. నిరుద్యోగ యువత కోసం గ్రామ సచివాలయంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. యువత పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్లి చదువుకునే అవకాశం కల్పించారు. నిరుపేద విద్యార్థులకు ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతోంది. పంచాయతీలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలంతా జగన్ వెంటే..



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మహిళల పేరుతో పథకాలు అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని పెంచారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ, వంటి పథకాలతో మహిళల ఆర్థిక స్వావలంభనకు చేయూత అందించారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలుచునే విధంగా ప్రభుత్వం తోడ్పాటునందించింది. మహిళా సంక్షేమానికి కృషిచేసిన ముఖ్యమంత్రి జగన్ వెంటే మేమంతా ఉన్నాం. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– క్లోపల్లి సరస్వతి, సర్పంచ్, పెదబోరబంద పంచాయతీ


సచివాలయంలో అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలు

పేదల పెన్నిధి సీఎం జగన్



పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారు. కరోనా కష్టకాలంలో ఎవ్వరూ పట్టించుకోకపోయినా నేనున్నానంటూ భరోసా ఇస్తూ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అన్ని సరుకులు చేరవేశారు. మెరుగైన వైద్యం, పిల్లలకు నాణ్యమైన విద్య, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఒక కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రజలకు ఇంత మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రతి ఒక్కరూ ఎదురుచూస్తున్నారు.

– క్లోపల్లి త్రినాథ, ఎంపీటీసీ, శివరాంపురం

వైఎస్సార్‌సీపీ పాలనలో రైతే రాజు

- విత్తనాల నుంచి పంట కొనుగోలు వరకు అండగా ప్రభుత్వం
- రైతుభరోసా కింద పెట్టుబడి సాయం
- నియోజకవర్గంలో 33,414 మంది రైతులకు రూ.204.36 కోట్ల చెల్లింపు
- రూ.1.05 కోట్లతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు

2019-2024 మధ్య నియోజకవర్గంలో వైఎస్సార్ రైతుభరోసా- పీఎం కిసాన్ నిధులు చెల్లింపు వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య	నగదు(రూ.కోట్లలో)
సాలూరు	11907	69.30
పాచిపెంట	6972	40.18
మక్కువ	8381	53.35
మెంటాడ	6154	41.53
మొత్తం	33,414	204.36


సాలూరులో వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర(ఫైల్)

సాలూరు:

దేశానికి రైతే వెన్నెముక. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. ఇది పాలకులందరు చెప్పే మాటలే. అయితే ఆ మాటలు నిజం చేస్తూ రైతును రాజుని చేసింది వైఎస్సార్ కుటుంబమే అని రైతులంతా ముక్తకంఠంగా చెపుతున్నారు. వ్యవసాయాన్ని దండగని చంద్రబాబు చెప్పగా, అదే వ్యవసాయాన్ని పండగగా మార్చి రైతులకు అండగా నిలిచింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. 2014 ఎన్నికల్లో రైతుల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ఆ హామీని అమలు చేయకుండా రైతులను మోసం చేశారు. అటువంటి చంద్రబాబు నేడు మరలా సూపర్ సిక్స్ అంటూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, టీడీపీ నాయకులను నమ్మేదే లేదని రైతులు, ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

రైతును రాజుని చేసింది వైఎస్సార్‌సీపీ..

రైతును రాజును చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. నియోజకవర్గంలో పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్, ఆంధ్ర తదితర ప్రాజెక్టుల ఆధునీకరణకు నిధులు మంజూరు చేశారు. రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామ స్థాయిలోనే రైతులను నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలను సరఫరా చేశారు. సుమారు రూ.1.05 కోట్లతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకున్నారు. గిరిజన రైతులకు పోడు పట్టాలు, డీకే పట్టాలు పంపిణీ చేశారు. పంట సాగు నుంచి పంట కొనుగోలు వరకు ప్రతీ దాంట్లో ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది.


పాచిపెంట సమీపంలోని పెద్దగెడ్డ రిజర్వాయర్

నిశ్చింతగా సాగు చేస్తున్నాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. రాయితీపై విత్తనాలు, ఎరువులు అందివ్వడంతో పాటు ప్రభుత్వమే రైతులకు మద్దతు ధర చెల్లించి పంట కొనుగోలు చేస్తోంది. రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించడంతో సాగు కోసం అప్పు చేయాల్సిన అవసరం లేదు. నిశ్చింతగా వ్యవసాయం చేసుకుంటున్నాం.

– ఆగతాన త్రినాథ, రైతు, లోతుగెడ్డ గ్రామం, మెంటాడ మండలం

నేడు మక్కువలో ప్రచారం

మక్కువ: మండలంలోని కొయ్యానపేట, కంచేడువలస, వెంకటభైరిపురం, డి.శిర్లాం, దబ్బగెడ్డ, కోన, గోపాలపురం, తూరుమామిడి, బంగారువలస గ్రామాల్లో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ, బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు తెలిపారు.